


# పిల్లలున్నారు జాగ్రత్త

-రావిపల్లి నారాయణరావు

ఆఫీసుకెళ్ళాలని బయల్దేరాను. అప్పటికే అరగంట ఆలస్యమైంది. గ్యారేజ్‌లో ఉన్న కారుని తీసి రోడ్డు మీద పెట్టాను. గేటు మూసి, కారు డోర్ తెరవటానికి మూడడుగులు ముందుకెళ్ళానో లేదో, ఎదురింటి మురళి కనపడ్డాడు. అతని వెనుక హారిక ఉంది. ఆ ఇద్దర్ని చూశాక నేను కారు ఎక్కలేదు. అక్కడే నిలబడిపోయాను.

మా ఇంటి ఎదుట ఉన్న బంగళాని 'వైట్‌హౌస్' అంటారు. అది చాలా పెద్ద ఇల్లు. చుట్టూ ఎరుపురంగులో ఆకర్షణీయంగా బోగన్‌విల్లా పూలు ఆ ఇంటికి ఎంతో అందాన్నిచ్చాయి. ఆ ఇంట్లో ఉన్న శోభన్‌రావు, ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ ఎమ్డీగా పని చేస్తున్నాడు. అతని భార్య వైజయంతి. స్థానికంగా ఉన్న మిషనరీ హైస్కూల్ టీచర్. కిందటి జన్మలో ఎంతో పుణ్యాం చేసి ఉన్నందువల్ల ననుకుంటా, గొప్ప తెలివితేటలు, వినయ విధేయతలు గల ఇద్దరు పిల్లలు - మురళి, హారికలకు ఆ దంపతులు తల్లిదండ్రులయ్యారు.

మురళి టెన్త్ క్లాసు, హారిక సెవెన్త్ చదువుతున్నారు. అన్ని పరీక్షల్లోను ఆ ఇద్దరు పిల్లలు ఫస్ట్‌రేంక్ సొంతం చేసుకుంటూ ఉంటారు. ఈ మధ్యనే వాళ్ల స్కూల్ డే జరిగింది. అలాంటి ఫంక్షన్స్‌కి పిల్లలతోపాటు పేరెంట్స్‌ని కూడా రమ్మని ఆహ్వానిస్తారు. శోభన్‌రావు, వైజయంతి పిల్లలతో స్కూల్ ఫంక్షన్స్ కెళ్ళటం ఎప్పుడూ నాకంట పడలేదు. ఒకరోజు మురళి, హారిక నా దగ్గరకొచ్చి, స్కూల్ డే ఫంక్షన్‌కి వారి వెంట రమ్మని నన్ను కోరారు. నేను ఓకే అన్నాను.

మురళి, హారిక చదువుతున్న స్కూలు చాలా పెద్దది. విశాలంగా ఉంది. బాయిస్ వింగ్, గర్ల్స్ వింగ్ కలిపితే స్కూల్లో సుమారు మూడు వేల స్ట్రెంగ్త్ ఉండొచ్చు. స్కూల్ డే ఫంక్షన్ కలర్‌ఫుల్‌గా ఉంది. చదువులోనే కాదు, స్పోర్ట్స్‌లో కూడా మురళి ప్రవీణుడే... ఆ రోజు ఐదారు ప్రైజులు అతను కైవసం చేసుకున్నాడు. ముఖ్య అతిథిగా వచ్చిన మంత్రిగారు బహుమతి ప్రదానం చేశారు. ఫంక్షన్ ముగియక ముందే బహుమతులతో నా దగ్గరకొచ్చారు మురళి, హారిక. ఆ పిల్లల ఆనందానికి అవధులు లేవు. పిల్లలతో సంతోషం పంచుకోవటానికి అదృష్టం కూడా ఉండాలి. శోభన్‌రావు, వైజయంతి పిల్లల మంచి చెడ్డల్ని పట్టించుకోరనుకుంటాను. లేకపోతే కన్నపిల్లలతో ఆనందం పంచుకోటానికి స్కూల్ డే ఫంక్షన్‌కు రాకుండా పోతారా...!

శోభన్‌రావు దంపతుల ఇంటికి ఎదుట ఉన్న ఫ్లాటుకు నేను మకాం మార్చి రెండేళ్లు కావచ్చు. అప్పటి నుంచి నేను, శోభన్‌రావు కుటుంబ విషయాలు గమనిస్తూనే ఉన్నాను. మా వీధిలో కట్టిన ఇళ్లు చాలా పెద్దవే అయినా రెండు వరుసల ఇళ్ల మధ్య ఉన్న రోడ్డు విశాలంగా లేదు. ఇక్కడ ఇంట్లో గట్టిగా మాట్లాడితే, అటువైపు ఉన్న ఇంట్లో వారి చెవుల్లో బాకా ఊదినట్టు ఉంటుంది. ఆఫీసు విడిచిపెట్టాక, సూర్యాస్తమయానికి ముందు శోభన్‌రావు ఇల్లు చేరుకునే దాఖలాలు లేవు. ఇంటికొచ్చిన తర్వాత అయినా భార్యతోగాని, పిల్లలతోగాని శోభన్‌రావు సరదాగా గడిపిన సంఘటనలు నా దృష్టిలో పడలేదు. కాని రాత్రి పది పదకొండు గంటల తర్వాత తరచు పెద్దపెద్ద కేకలు ఆ ఇంటి నుండి వినిపిస్తూ ఉంటాయి. భార్యాభర్తలు ఇంట్లో గొడవలు పడుతున్నారేమో... నేనెప్పుడూ వారి గొడవల్లో జోక్యం కలుగజేసుకోలేదు. ఒకరినొకరు ద్వేషించుకునేటప్పుడు, అక్కడకు వెళ్ళి ఆ ఇద్దరికి మంచి మాటలు చెప్పి, పిల్లల భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకుని జీవితం సుఖంగా సాగించాలని ఉచిత సలహాను ఇవ్వాలనుకుంటాను. కాని ధైర్యం చాలలేదు. ఆలుమగల పోట్లాటలో నువ్వు తలదూర్చకు అని ఆ దంపతుల్లో ఎవరైనా అంటారేమోనని నా భయం.

ఆలోచనల నుండి తేరుకున్న నేను తలపైకెత్తి చూశాను. మురళి, హారికలు రోడ్డు మీద నడక సాగించారు... రోజూ ఆటోలో స్కూలుకు వెళ్ళే ఈ పిల్లలు ఈ రోజు నడుచుకుని వెళ్తున్నారేమిటి? ఇద్దరూ స్కూలు యూనిఫాం వేసుకుని ఉన్నారు. కాని వారి చేతుల్లో పుస్తకాలు లేవు. ఈ రోజు ఆటో రాలేదా?... టైం పది దాటింది. ఇంత లేటుగా బయల్దేరారేమిటి? 'బాబూ - మురళీ!... హారికా...' గట్టిగా కేకేశాను.

ఇద్దరూ వెనక్కి తిరిగి చూశారు. వాళ్ల మొహాలు నిస్తేజంగా కనిపించాయి. 'పిల్లలూ ఇలా రండి' పిలిచాను.

కళ్లు తుడుచుకుంటూ వాళ్లు నా కారు దగ్గరకొచ్చారు.

సుడులు తిరిగే కన్నీళ్లు జలజలా రాలి ఆ చిన్నారుల లేత బుగ్గలపై ధారలు ఏర్పరచుకున్నాయి. రోజూ చలాకీగా ఆడుకుంటూ పాడుకుంటూ ఉండే పిల్లలు సర్వం పోగొట్టుకున్న అనాథల్లా ఆ క్షణాన నా కంటి కగుపించారు.

'ఈ రోజు స్కూలు లేదా?' అడిగాను నేను.

'ఉంది' చెప్పాడు మురళి కళ్లు తుడుచుకుంటూ.

'ఇప్పుడు టైం పది దాటింది కదా - స్కూలుకి ఇప్పుడు బయల్దేరారేవిటి?'

జవాబు చెప్పలేదు. ఒకరి మొహం మరొకరు చూసుకుంటూ పిల్లలిద్దరూ కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయారు.

'చూడు మురళీ - నువ్వు కన్నీళ్లు పెట్టడం ఏమీ బాగోలేదు. ఇప్పుడు నువ్వు టెన్త్ చదువుతున్నావ్. వచ్చే సంవత్సరం కాలేజీకి వెళ్ళబోతున్నావ్ - అవునా?... ఎవరైనా ఇలా

ఆలోచనల నుండి తేరుకున్న నేను తలపైకెత్తి చూశాను. మురళి, హారికలు రోడ్డు మీద నడక సాగించారు... రోజూ ఆటోలో స్కూలుకు వెళ్ళే ఈ పిల్లలు ఈ రోజు నడుచుకుని వెళ్తున్నారేమిటి? ఇద్దరూ స్కూలు యూనిఫాం వేసుకుని ఉన్నారు. కాని వారి చేతుల్లో పుస్తకాలు లేవు. ఈ రోజు ఆటో రాలేదా?... టైం పది దాటింది. ఇంత లేటుగా బయల్దేరారేమిటి?

కంటతడి పెడతారా? నోనో... బీ చీర్‌ఫుల్. హారిక చిన్నపిల్ల, బాధను తట్టుకోలేక పోతుందేమో... ఇంతకీ జరిగిందేవిటి? ఎనీ ప్రాబ్లెమ్?? మీకేదైనా కష్టం వస్తే నేను లేనా... నాతో చెప్పాలి కదా - నేను మీ ఫ్రెండుని కాదా... లేకపోతే మీ అంకుల్ని అనుకోవచ్చు కదా! ఆ రోజు ఫంక్షన్ జరిగినప్పుడు మీ స్కూలుకొచ్చాను. ప్రోగ్రామ్ పూర్తిగా చూశాను. మీరు ఎన్నో బహుమతుల నందుకున్నారు. ముఖ్య అతిథిగా వచ్చిన మంత్రిగారు మిమ్మల్ని ఆశీర్వదించి షేకండిచ్చారు. ఫంక్షన్ హాలు కరతాళ ధ్వనులతో దద్దరిల్లిపోయింది. నేను ఆనందం పట్టలేక పోయాను. అది సరే, ఇప్పుడు మీరెక్కడికి బయల్దేరారు? స్కూలుకే కదా! కారెక్కండి. నేను డ్రాప్ చేస్తాను' అన్నాను.

'లేదంకుల్. మేము స్కూలుకెళ్ళడం లేదు' అన్నాడు మురళి.

'స్కూలుకెళ్ళడం లేదా? - మరెక్కడికి బయల్దేరారు?' సూటిగా వాళ్ల కళ్లల్లోకి చూశాను.

ఎవరూ నోరు విప్పలేదు. దిక్కులు చూస్తూ నిలబడ్డారు.

'భయపడకు మురళీ - చెప్పు' ఆప్యాయంగా అతని భుజం మీద చెయ్యి వేశాను.

'అంకుల్, మీరు కోప్పడకండి. కోప్పడనంటే చెప్తాను' అన్నాడు మురళి.

'నేనెందుకు కోప్పడతాను - కోప్పడను... చెప్పు మురళీ'

'అంకుల్.. ఇప్పుడు మేం కోర్టుకెళ్తున్నాం'

'కోర్టు కెళ్తున్నారా?? ఎందుకు?'

'జడ్జిగార్ని కలుసుకోడానికి'

నా నోట మాట రాలేదు. ఇద్దర్ని దగ్గరకు తీసుకుని 'మురళీ, నువ్వు జడ్జిగార్ని కలుసుకుంటావా? ఎందుకు?' అడిగాను.

'అంకుల్, మీకు మా డాడీ, మమ్మీ సంగతి తెలీదు. ఆ ఇద్దరు రోజూ దెబ్బలాడుకుంటూ ఉంటారు. వారిద్దరు విడిపోటానికి సిద్ధంగా ఉన్నట్టు వారి మాటల్నిబట్టి నేను అర్థం చేసుకున్నాను. మమ్మీ అంటే డాడీకి ఇష్టం లేదు. డాడీ అంటే మమ్మీకి ఇష్టం లేదు. ఇష్టం ఉంటే రోజూ పోట్లాడుకుంటారా?... మీరే చెప్పండి అంకుల్. నేను, హారిక కంటతడి పెట్టని రోజు లేదు. ఈ రోజు ఉదయం నిద్ర నుండి లేవగానే చూశాము - మమ్మీ, డాడీ కనిపించలేదు. ఎక్కడికెళ్ళారో, ఇంట్లో మాత్రం లేరు. విడాకుల కోసం బయటికెళ్ళి ఉండొచ్చు. రాత్రి పడుకునే ముందు వాళ్లు మాట్లాడుకోవటం నేను విన్నాను.' కళ్ళు తుడుచుకుంటూ చెప్పాడు మురళి. అతను దుఃఖాన్ని ఆపుకోలేక పోయాడు.

'కంట్రోల్ యువర్ సెల్ఫ్ మురళీ... అసలు మీ మమ్మీ డాడీలు విడాకులు తీసుకుంటారని మీకెవరు చెప్పారు?' నేను అడిగాను.



-'శోభన్‌రావుగారూ మీకు సలహా ఇచ్చే అనుభవంగాని, చనువుగా మాట్లాడే పరిచయం గాని నాకు లేవు. కాని, మీ ముందుకు వచ్చి మాట్లాడే పరిస్థితి ఇప్పుడే కలిగింది... పిల్లల మనసు చాలా సున్నితం. ఆ విషయం నాకంటే మీకే బాగా తెలుసు. తల్లి దండ్రులు పిల్లల ముందు కీచులాడుకోవటం ఏమంత మంచిపని కాదని నా అభిప్రాయం

'ఎవరూ చెప్పలేదంకుల్. మేమే అనుకుంటున్నాము. ఎందుకంటే, రాత్రి నిద్రపోయే ముందు మమ్మీ డాడీ గొడవ పడ్డారు. గట్టిగా తిట్టుకున్నారు. ఇక నీతో నేను కలిసి ఉండను అని మమ్మీ అంది. ఐ హేట్ యూ అని డాడీ అరిచారు. ఉదయం లేవగానే చూస్తే ఇద్దరూ ఇంట్లో కనపడలేదు' చెప్పాడు మురళి.

ఆలుమగల తగవు అద్దం మీద ఆవగింజ అంటారు. ఆ విషయం ఎలా చెబితే వీరికి అర్థమవుతుంది...? ఆలోచించాను.

డాడీ మమ్మీలు విడాకుల కోసం వెళ్ళలేదు అని చెప్పినా ఆ పసివాళ్లు నా మాటను నమ్మే స్థితిలో లేరు.

'డోంట్‌వర్రీ మురళీ - మీ వెంట నేనున్నాను. మీకు ఏమీ కాదు. మీ డాడీ, మమ్మీ విడాకులు తీసుకునే ఆఫీసుకు వెళ్ళారని మీరు అంటున్నారు కదా... మిమ్మల్ని నేను అక్కడికే తీసుకెళ్తాను. కార్యెక్కండి' అన్నాను.

హారిక, మురళి కార్లో కూర్చున్నారు. ఆ తర్వాత స్టీరింగ్ ముందు కూర్చుని నేను కారు స్టార్ట్ చేయబోయాను. అదే క్షణాన మా ఎదుట ఒక ఆటో ఆగింది. శోభన్‌రావు, ఆ వెనుక వైజయంతి ఆటో నుండి దిగారు. ఆ ఇద్దరు కార్లో కూర్చున్న పిల్లల్ని చూసి కొన్ని క్షణాలు మ్రాన్పడిపోయారు.

'అవునూ, మీరు పిల్లల్ని ఎక్కడికి తీసుకెళ్తున్నారు?' శోభన్‌రావు అడిగాడు.

కొంతసేపు నేను స్థాణువులా అక్కడే నిలబడిపోయాను. జవాబు చెప్పటానికి మాటలు కరవయ్యాయి.

కారు డోరు తెరిచి హారికను కిందకు దించాడు శోభన్‌రావు. అతని చేయి పట్టుకుని పక్కనే నిలబడింది హారిక. ఆ తర్వాత కారు దిగిన మురళి వైజయంతి పక్కన చేరాడు. తల్లిదండ్రులను చూడగానే ఆ చిన్నారుల మనసులు తేలిక పడ్డాయి. వారి ఆనందానికి అవధులు లేకపోయాయి.

'ఒక ఫ్రెండ్‌కి యాక్సిడెంట్ జరిగిందని తెల్లారక ముందు ఫోను వచ్చింది. అవుట్‌హౌస్‌లో పడుకున్న పనిమనిషి సీతాలుకు చెప్పి నేను, మీ మమ్మీ ఆస్పత్రికి బయల్దేరాం. సీతాలు మీకు చెప్పలేదా?' మాట్లాడుతూ తన బంగళా వైపు నడిచాడు శోభన్‌రావు. అతని వెంట వైజయంతి, మురళి, హారిక వెళ్లారు. కుటుంబ సభ్యులందరు కలిసి ఇంట్లో అడుగుపెడుతుంటే చూడ్డానికి నా రెండు కళ్లు చాలలేదు.

-'శోభన్‌రావుగారూ మీకు సలహా ఇచ్చే అనుభవం గాని, చనువుగా మాట్లాడే పరిచయం గాని నాకు లేవు. కాని, మీ ముందుకు వచ్చి మాట్లాడే పరిస్థితి ఇప్పుడే కలిగింది... పిల్లల మనసు చాలా సున్నితం. ఆ విషయం నాకంటే మీకే బాగా తెలుసు. తల్లిదండ్రులు పిల్లల ముందు కీచులాడుకోవటం ఏమంత మంచిపని కాదని నా అభిప్రాయం - అని మెల్లగా మందలించటానికి ఆ రోజు రాత్రి ఎదురింటికి దారి తీశాను నేను.

★

## ఎక్కువ పిల్లల్ని కనండి!

ఆడవాళ్ల ముఖ్యమైన పని పిల్లలను కనడం, వారిని పెంచడం..ఈ 21వ శతాబ్దంలో మన దేశంలో ఇలాంటి పిలుపు ఎవరైనా ఇస్తే వాళ్లను ఆడవాళ్లు బతకనివ్వరేమో! అయితే ఇరాన్ అధ్యక్షుడు అహ్మదీనెజాద్ తన దేశ ప్రజలకు ఇలాంటి పిలుపునిచ్చారు. ఇరాన్‌లో జనసంఖ్యను పెంచాలంటే శిశు జననాల సంఖ్యను రెట్టింపు చేయాలి. అమెరికా లాంటి పాశ్చాత్య దేశాలను బెదిరించాలంటే ఈ జనసంఖ్య అత్యవసరం. దేశ జనాభా ఇప్పుడున్న దానికి రెట్టింపుఅంటే 120 మిలియన్లకు మించి పెరగాలనేది ఆయన ఆశ. దేశ అణు సామర్థ్యం పది రెట్లు పెరిగినందుకు ఆయన ఎంతో గర్విస్తున్నారు. ఇద్దరికంటే ఎక్కువ మంది పిల్లలను కనడాన్ని నిరుత్సాహ పరిచే ఇప్పటి జనాభా నియంత్రణ చట్టాన్ని రద్దు చేయాలి. ఆడవాళ్లు బయట కష్టపడడం తగ్గించి వారి ముఖ్యకార్యమైన పిల్లలను కనడం, వారిని పెంచడంపైన ఎక్కువ శ్రద్ధ వహించేలా చూడాలని అహ్మది నెజాద్ పిలుపునిచ్చారు. అయితే ఆయన ఇచ్చిన ఈ పిలుపు ఇస్లామిక్ మత పెద్దలు అంగీకరించిన అధికారిక నీతికి వ్యతిరేకంగా ఉండడం గమనార్హం. ఇప్పుడు 70 మిలియన్లున్న దేశ జనాభాకు పగ్గాలు వేసే చట్టాలు ఇప్పటికే దేశంలో అమలులో ఉన్నాయి. ఈ విధానం ప్రకారం మహిళల్లో సంతాన శక్తిని హరించే ఆపరేషన్లు, వ్యాసక్టమీ, నూతన దంపతులకు కుటుంబ నియంత్రణ శిక్షణా తరగతులు నిర్వహించడం లాంటి అనేక విధానాలు అమలులో ఉన్నాయి. అన్నిటికన్నా మించి ఇరాన్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలో కండోమ్‌లను తయారు చేసే ఓ ఫ్యాక్టరీ కూడా ఉంది. అయితే అహ్మదీనెజాద్ ఆలోచనే వేరు. ఎక్కువ మంది సంతానం అవసరమనేది ఆయన ఆలోచన. అందుకే పిల్లల సంఖ్యను బట్టి మహిళలు పని చేసే గంటలను తగ్గించే శాసనాన్ని తీసుకురావాలనేది ఆయన ఆలోచన. పూర్తి జీతం తీసుకుంటూ సగం సమయమే పని చేసే చట్టాన్ని తీసుకు రావడానికి కూడా తాము సిద్ధమేనని ఆయన చెప్తున్నారు. అయితే ఇవి అన్నీ తెలివితక్కువ ఆలోచనలని ప్రగతిశీలుల అభిప్రాయం. వారి అభిప్రాయం ఎలా ఉన్నా ఇరాన్‌లో అహ్మదీనెజాద్ ఏం చేసినా సమర్థించే వారు చాలా మందే ఉన్నారు కాబట్టి అలాంటి చట్టాలు వచ్చినా ఆశ్చర్యం ఏమీ లేదు.

-హర్షిత్